

బోడుప్పల్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు.

వారాహి కాలనీ అభివృద్ధికి కృషిచేస్తా



కిషోర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు

బోడుప్పల్: 4వ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పడిన వారాహి కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మేడ్చల్ నియోజక వర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్ అన్నారు. లెక్చ రర్స్ కాలనీలో కొంత భాగంగా విడిపోయి ఆ కాలనీవాసులు ఈ సోమవారం నూతన కాలనీని ఏర్పాటు చేశారు. అనంతరం కిశోర్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 2015 సంవత్సరంలో వేరే లేఅవుట్‌లో ఉన్న ఈ కాలనీని అప్పుడు లెక్చరర్స్ కాలనీలో కలిపారని, భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఆ కాలనీ నుంచి విడిపోయి వారాహి కాలనీగా నామకరణం చేసినట్లు కాలనీవాసులు వివరించారు. కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కిశోర్‌గౌడ్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



డీసీకి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ చేతన, కాలనీవాసులు

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ వీధి నంబర్–8 ఎస్‌ఆర్ అపార్టుమెంట్ వెనుక ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్, కాలనీవాసులతో కలిసి ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులును కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలం కబ్జా అవుతోందని ఎన్నో మార్లు టౌన్‌ప్లానింగ్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, సెక్రటరీ కీర్తన్, బీజేపీ నాయకులు సుమన్‌రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కాకుండా చెరువులను కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలో ఉన్న చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు చిట్టిబాబు ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు తహసీల్దార్ స్పందించి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షులు నిమ్మ అశోక్‌రెడ్డి, నాయకులు, యూత్ నాయకులు. స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డీసీకి వినతి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ శ్రీసాయి సూర్యకాలనీ, లోటస్‌పాండ్ రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కోరుతూ అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో పారిశుద్ధ్య పనులు సరిగ్గా చేయడం లేదని, దోమల బెడద ఎక్కువగా ఉందని, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పరిష్కరించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు డీసీ స్పందించి శానిటరీ, ఎంటమాలజీ అధికారులను పిలిచి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కాలనీల ప్రతినిధులు రమేష్ యాదవ్, సతీష్, శ్రీనివాస్‌రావు, రాజుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన చిల్లా అశోక్ ముదిరాజ్



అశోక్ ముదిరాజ్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

మల్లాపూర్: బీఆర్‌ఎస్ నాచారం డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి చిల్లా అశోక్ ముదిరాజ్ బీజేపీలో చేరారు. మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చిల్లా అశోక్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన సీనియర్ నేతలు శంకర్‌రెడ్డి, ఆడపా సురేష్, నర్సింహ, రాజేందర్, రాజ్‌గోపాల్‌రెడ్డి, శేషు, కట్ట వినయ్‌కుమార్, ఎల్లేష్, చింటూ, కృష్ణ తదితరులు చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, అంపాల పద్మారెడ్డి, ప్రకాష్, గోపాల్‌గౌడ్ తదితరులున్నారు.

ఇద్దరిపై వీధి కుక్క దాడి

మల్లాపూర్: ఓల్డ్‌మల్లాపూర్ సీతారామాంజనేయ స్వామి దేవాలయం సమీపంలో సోమవారం ఉదయం ఇద్దరు వ్యక్తులపై వీధి కుక్క దాడి చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ మల్లాపూర్‌కు చెందిన కుమ్మరి నర్సింహ(60) కుమార్(30) నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క వెంటపడి దాడి చేసింది. దీంతో వారి కాళ్లకు గాయాలయ్యాయి. స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలను పట్టుకు వెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికలకు అందరూ సహకరించాలి

మల్కాజిగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్

- ఏప్రిల్ 18 నుంచి 29 వరకు నామినేషన్ల ఘట్టం
- మే 13న ఎన్నికలు.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- 15 వరకు ఓటరు నమోదు.. మార్పునకు అవకాశం
- లోక్‌సభ పరిధిలో 3,228 పోలింగ్ కేంద్రాలు



సాక్షి, మేడ్చల్‌జిల్లా: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ లోకసభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకారం అందించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ లోకసభ ఎన్నికల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ లోకసభ సాధారణ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిందని, దీనికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న జారీ అవుతుందని ఆయన గౌతమ్ తెలిపారు. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏఆర్‌ఓలను కూడా నియమించినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని అన్నారు.

- ఓటరు జాబితా ప్రకారం 8 ఫిబ్రవరి 2024 నాటికి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 37 లక్షల 28 వేల 417 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో 15,117 మంది 85 సంవత్సరాల వయస్సుకు పైబడిన ఓటర్లు ఉండగా, 26,119 మంది దివ్యాంగులు ఉన్నట్లు తెలిపారు. వీరందరికి ఫారం–12డి ద్వారా హోం ఓటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు.
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారందరూ ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 3,228 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 19,450 సిబ్బందిని నియమించినట్లు పూర్కొన్నారు.
- ఓటరుకు రెండు కిలోమీటర్ల రేడియస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అర్బన్‌లో 1500 నుంచి 1600 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, గ్రామీణ ప్రాంతంలో 1500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్..

- ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన శనివారం నుంచి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.
- రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం సువిధ యాప్ ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. ప్రతిరోజూ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని తెలిపారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని అన్నారు.
- ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, వ్యయ పర్యవేక్షణ తదితర కమిటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 1950

- ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా, సి–విజిల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. కలెక్టరేట్లో ఫిర్యాదులు స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సి–విజిల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారన్నారు.
- రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ స్థలాల్లో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని చెప్పారు.
- ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో డీపీఆర్‌ఓ అరుంధతి, వివిధ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టు పడతాం.. ప్రగతి సాధిస్తాం..

జవహర్‌నగర్ నూతన మేయర్‌గా దొంతగాని శాంతికోటేష్‌గౌడ్



మేయర్ శాంతికి నియామకపత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి వెంకట ఉపేందర్‌రెడ్డి

జవహర్‌నగర్: పట్టుబట్టి ప్రగతి సాధిస్తామని జవహర్‌నగర్ కార్పొరేషన్ నూతన మేయర్ దొంతగాని శాంతికోటేష్‌గౌడ్ అన్నారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్ ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు 18 మంది కార్పొరేటర్లు మేయర్‌గా శాంతికోటేష్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన మేయర్ శాంతిగౌడ్ మాట్లాడుతూ జవహర్‌నగర్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మేయర్ ఎన్నికకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తనకు మద్దతు ఇచ్చిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత గ్రామపంచాయతీ హయాంలో తాను ఎంపీటీసీగా ఎన్నో సేవలు అందించానని, మళ్లీ మేయర్‌గా సేవలందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అన్ని పార్టీల నాయకులు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మల్లాపూర్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రీతమ్‌ను సోమవారం నాచారం డివిజన్‌కు చెందిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ హెచ్‌ఆర్.మోహన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రీతమ్‌ను శాలువాతో సత్కరించి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. బండారం రఘు, కొంగరి కుమార్, పెరిక వెంకటేష్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ డబ్బులడిగితే గుంజకు కట్టేయండి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్



మాజీ సర్పంచ్, కార్పొరేటర్‌ను సముదాయిస్తున్న వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ల అక్రమ దందాను నడవనివ్వమని, కార్పొరేటర్ పేదల ఇళ్ల వద్దకు వచ్చి డబ్బులు అడిగితే అక్కడికక్కడే గుంజకు కట్టేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్‌ల దీక్ష ప్రాంగణానికి వచ్చి మాట్లాడారు. కాంగ్రెస్‌లో నిజమైన కార్యకర్తలకు తప్పకుండా మంచి అవకాశాలను అధిష్టానం కలిప్తుందన్నారు. జవహర్‌నగర్‌లో ఇక భూదందా జరగనివ్వమని, ఇక్కడి నిరుపేదలు ఎంతోమంది 10 ఏళ్ల నుంచి జీవిస్తున్నారని, వారందరూ ఇంటి పక్కనో, ఇంటిపైనో స్లాబులు వేసుకుంటే డబ్బులివ్వాలని కొంతమంది కార్పొరేటర్లు వేధిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని ఇకపై అలాంటి ఘటనలు జరగన్వివమని, ఎవరైనా అక్కడి వచ్చి డిమాండ్ చేస్తే అక్కడే ఉన్న గుంజకు వారిని కట్టేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ కొత్తగా ఎవరైనా కార్పొరేటర్ ఎటువంటి అక్రమ దందా చేసినట్లు సమాచారం అందిస్తే తామే స్వయంగా వస్తామన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్‌లను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌తో కలిసి సముదాయించి దీక్షను విరమింపజేశారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లో శ్రీనాభి శిల(బొడ్రాయి) ప్రతిష్ఠ ఏర్పాటుకు సోమవారం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శంకుస్థాపన పనులు ప్రారంభించారు. ఏప్రిల్ 12, 13, 14వ తేదీల్లో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, సర్వేష్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వినోద్, దేవేందర్, వెంకటేష్, జ్ఞానేశ్వర్, రాజారం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డబ్బులడిగిన జూనియర్ అసిస్టెంట్ రమేష్ సస్పెన్షన్

ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కీసర తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి పథకంలో డబ్బులు(లంచం) అడిగిన జూనియర్ అసిస్టెంట్ ఎ.రమేష్‌ను సస్పెండ్ చేస్తూ.. సోమవారం కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. మీట్ ది మీడియా సమావేశంలో కీసర తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకున్న విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే కీసర ఆర్డీవో ఈ ఘటనపై విచారణ నిర్వహించారు. ఇందులో కీసర తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.రమేష్ కల్యాణలక్ష్మి విషయంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆర్డీఓ విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ గౌతమ్ జూనియర్ అసిస్టెంట్ రమేష్‌ను సస్పెండ్ చేశారు. రమేష్ గతంలో కామారెడ్డిలో వీఆర్‌ఏగా పనిచేశారు. వీఆర్‌ఏ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా కన్వర్ట్ చేయగా, కీసర తహసీల్దార్ కార్యాలయంలో పోస్టింగ్ పొందారు.

నిజాం నిరంకుశ పాలనకు దర్పణం రజాకార్ సినిమా



థియేటర్ వద్ద కార్పొరేటర్ శ్రవణ్ తదితరులు

మల్కాజిగిరి: తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు దర్పణం పట్టేలా రజాకార్ సినిమా ఉందని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మల్కాజిగిరి సాయిరాం థియేటర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో రజాకార్ సినిమా వీక్షించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశపాలన, తెలంగాణ సాయుధపోరాటాన్ని చిత్ర దర్శకుడు యాటా సత్యనారాయణ కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారని, మంచి చిత్రాన్ని నిర్మించిన నిర్మాత గూడూరు నారాయణరెడ్డికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

22 నుంచి జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు

కీసర: చీర్యాల గ్రామ రెవెన్యూ పరిధిలోని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈ నెల 22 నుంచి 24 వరకు జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు టీ–10 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సందీప్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలత, చైర్మన్ కొమురయ్య తెలిపారు. పోటీల బ్రోచర్‌ను విడుదల చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి 8, తెలంగాణ రాష్ట్రం నుంచి 6 టీంలు పోటీల్లో పాల్గొంటాయని వివరించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



శ్మశానవాటిక వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్‌లోని సీబీఎస్ కాలనీ, భూపేష్‌నగర్, కిందిబస్తీ, కుమ్మరి బస్తీ, మంగల్ బస్తీ, కల్వరి లైన్, యాప్రాల్‌లో సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డితో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వాంబే గృహాలకు తాగునీటి కనెక్షన్లు ఇవ్వాలని, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు తొలగించాలని, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని, బాక్స్ డ్రైన్ నిర్మించాలని, కమ్యూనిటీహాల్, బోర్‌వెల్ రిపేర్ చేయించాలని, బస్తీల్లో రోడ్లు వేయించాలని, ఎస్సీ శ్మశానవాటిక, ముస్లిం శ్మశానవాటికకు ప్రహరీ గోడ, షెడ్ నిర్మించాలని పలు సమస్యలను కాలనీవాసులు, బస్తీవాసులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే తన ముఖ్య లక్ష్యమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రావుల అంజయ్య, జీకె.హన్మంతరావు, మధుసూదన్ రెడ్డి, కరంచంద్, రమేష్, శివకుమార్, శంకర్ రావు, శ్రీనివాస్, శ్యామ్, సాధిక్, రఫీక్, ఆరీఫ్, గౌస్, నరేష్, రాంచందర్, శివ, శోభారాణి, రుబీనా, నవనీత తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడదాం



మాట్లాడుతున్న రాజిరెడ్డి

బోడుప్పల్: కార్మికులంతా ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడదామని ఎస్‌డబ్ల్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. చెంగిచర్ల డిపోలో జరిగిన ఎస్‌డబ్ల్యుయూ, ఐఎన్‌టీయుసీ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం కృషి చేస్తూ, మన సమస్యలు, హక్కుల కోసం పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషినల్ ప్రధాన కార్యదర్శి గోపాల్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగేష్ పటేల్, రీజనల్ కార్యదర్శి శ్రీనివాస్, యాదయ్య, నిరంజన్, పీఎంరెడ్డి, వెంకటేష్, ఎంఎస్‌రావు, జంగయ్య, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

చెంగిచర్ల డిపో నూతన కమిటీ ఎన్నిక

చెంగిచర్ల ఎస్‌డబ్ల్యుయు– ఐఎన్‌టియుసీ డిపో అధ్యక్షులుగా ఎస్.చంద్రయ్య, కార్యదర్శిగా బి.రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేష్, కోశాధికారిగా ఎండి సుల్తాన్ పాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చంద్రయ్య, కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ అందరం ఐక్యంగా హక్కుల కోసం పోరాడదామని పిలుపునిచ్చారు.

పొంగి పారుతున్న మురుగు



అల్వాల్: మచ్చబొల్లారం నుంచి అల్వాల్ చెరువు కట్ట ఎక్కే దారిలో మ్యాన్‌హోల్ పొంగి రోడ్డుపై పారుతోంది. దీని వల్ల వాహనదారులు, పాదచారులపై మురుగు నీరు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో రోజుకు వందల మంది, అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్తూ వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మొదటి రోజు ప్రశాంతంగా టెన్త్ ఎగ్జామ్స్





మల్కాజిగిరి, ఉప్పల్ ప్రాంతాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమ్యాయి. విద్యార్థులు పరీక్షా సమయంకంటే ముందుగానే కేంద్రాలకు చేరుకోగా సిబ్బంది వారిని తనిఖీ చేసి లోనికి అనుమతించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షా సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేశారు.

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



సాక్షి, మేడ్చల్‌జిల్లా: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ), మీడియా సెంటర్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ లాంఛనంగా ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసీఎంసీ పనితీరు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ నాగాంజలి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు జాగ్రత్తలు పాటించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల సమయంలో బ్యాంకర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లా కలెక్టరేట్లోని వీసీహాల్‌లో సోమవారం ఎన్నికల వ్యయమానిటరింగ్ సమావేశాన్ని బ్యాంకర్లతో నిర్వహించారు. బ్యాంకర్లకు, బ్యాంకు ఖాతాదారులకు ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్దేశించాలని కోరారు. నగదు రవాణా సమయంలో అవసరమైన మేరకు క్యూఆర్ కోడ్‌ను తప్పని సరిగా చూపించాలని అన్నారు. నగదు లావాదేవీలు, రవాణా చేసేటప్పుడు తగిన ఆధారాలతో జరగాలని నిర్దేశించారు. అలాగే, రూ.50 వేల కంటే ఎక్కువ ఉన్నట్లయితే అందుకు ధ్రువీకరణ పత్రం జతచేయాలని ఆయన సూచించారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాస్పద లావాదేవీలు ఉంటే రోజువారీగా నివేదిక సంబంధిత ఎల్డీఏంకు అందజేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, జిల్లా బ్యాంకర్లు, నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

